క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

పలిమెల: మండల కేంద్రంలో రేపు(గురువారం) మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. కాగా మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

తరలిరావాలి

భూపాలపల్లి రూరల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని ఆగస్టులో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో హైదరాబాదులో నిర్వహించే మహాసభకు జిల్లాలోని మాదిగలు స్వచ్ఛందంగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

ఎస్సై బదిలీ

టేకుమట్ల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న చల్ల రాజు వీఆర్‌కు బదిలీ అయినట్లు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సెప్టెంబర్ నెలలో టేకుమట్ల పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరిన ఆయన పది నెలల పాటు ఎస్సైగా సేవలు అందించారు. శాంతిభద్రతల పరిరక్షణలో, పెండింగ్ కేసులను చేధించే విషయంతో తనదైన ముద్ర వేశారు.

తహసీల్దార్‌గా సయ్యద్ సర్వర్

వాజేడు: వాజేడు తహసీల్దార్‌గా సయ్యద్ సర్వర్‌ను నియమిస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పనిచేసిన సయ్యద్ సర్వర్ ఈ నెల 14న కన్నాయిగూడెంకు డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏటూరునాగారంలో డీటీగా పని చేస్తున్న రాహుల్ చంద్రవర్మను వాజేడుకు బదిలీ చేసి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. తిరిగి సయ్యద్ సర్వర్‌ను తహసీల్దార్‌గా వాజేడుకు బదిలీ చేస్తు ఇన్‌చార్జ్‌గా ఉన్న రాహుల్ చంద్ర వర్మను డిప్యూటీ తహసీల్దార్‌గా కొనసాగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి

మంగపేట: మండలంలోని ప్రతీ గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రా కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వర్షాకాలం కావడంతో పాటు గత కొద్ది రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న కారణంగా గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారినపడి సరైన వైద్యం అందక స్థానిక ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. దోమెడలో చాలామంది జ్వరాల బారిపడి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండలంలోని మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధి కారులు స్పందించి రోజుకో గ్రామంలో తప్ప నిసరిగా వైద్య శిబిరం నిర్వహించాలని కోరా రు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

వాజేడు: పేకాట రాయుళ్లను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అయ్యవారిపేట పల్లె ప్రకృతి వనంలో కొంత మంది పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో కొంత మంది పారిపోగా కుమ్మరి మోహన్ రావు, కుమ్మరి సమ్మయ్య, గొడిశాల రమేష్, కుమ్మరి శ్రీకాంత్, బెరుగు సాయి అనే ఐదుగురు పట్టు బడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9270తో పాటు 260 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టు బడిన ఐదుగురుపై కేసు నమోదు చేసి మిగతా వారి కోసం వెతుకుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పారిశుద్ధ్య పనులను అడ్డుకున్న కార్మికులు

కాటారం: కాటారం గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం అధికారులు ప్రైవేటు వ్యక్తులతో పారిశుద్ధ్య పనులను చేయిస్తుండగా పంచాయతీ కార్మికులు అడ్డుకొన్నారు. ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ ఉపేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి షగీర్ ఖాన్‌లో కార్మికులు వాగ్వివాదానికి దిగారు. తాము సమ్మె చేస్తుంటే పారిశుద్ధ్య పనులు చేయించాలని చూడటం సరికాదన్నారు. పారిశుద్ధ్య పనులు నిలిచిపోవడం కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పనులు కొనసాగనివ్వాలని కార్మికులకు ఎంపీడీఓ సముదాయించడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదు. దీంతో చేసేది ఏంలేక పనులు నిలిపివేసి వెళ్లారు. జేఏసీ నాయకులు దోమల శ్రీనివాస్, మెండ మల్లయ్య, కొండయ్య తదితరులు ఉన్నారు.


కాటారం: అధికారులతో మాట్లాడుతున్న పంచాయతీ కార్మికులు

చిట్యాల: మండలంలోని జడల్‌పేట గ్రామంలో తాత్కాలిక డ్రైవర్‌తో చెత్త చేకరణ పనులు చేస్తుండగా అక్కడి జీపీ సిబ్బంది మంగళవారం పనులను అడ్డుకున్నారు. తాము సమ్మె చేస్తుండగా పనులు ఎందుకు చేస్తున్నారని అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ సిబ్బంది మేకల మధుకర్, పోలే లింగారావు, కంచేర్ల శంకర్, రజిత పాల్గొన్నారు.


చిట్యాల: పనులను అడ్డుకుంటున్న జీపీ సిబ్బంది


మహాముత్తారం: సమ్మెలో పాల్గొన్న సిబ్బంది

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

మహాముత్తారం: తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం 13వ రోజుకు చేరింది. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మెలో పాల్గొని తమ డిమాండ్లను నెరవేర్చాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘విద్యాసంస్థలపై అధికారి నిర్లక్ష్యం’

చిట్యాల: విద్యాసంస్థలపై మండల విద్యాశాఖ అధికారి కె.రఘుపతి నిర్లక్ష్యం వహిస్తూ, పాఠశాలను పర్యవేక్షించడంలో విఫలం చెందుతున్నాడని ఏబీవీపీ ప్రాంత కార్య సమితి సభ్యుడు వెల్పుల రాజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల విద్యాశాఖ అధికారి కనబడడం లేదని, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను పరిశీలించడంలో నిర్లక్ష్యం చేందారని అన్నారు. కొన్ని రోజులుగా మండలంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన చేస్తున్న క్రమంలో పాఠశాలలోని విద్యార్థులకు కనీసం వసతులు కల్పించిన దాఖాలాలు లేవన్నారు. మండలంలోని ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులతో పాటు, పుస్తకాలను తక్కువ రేటుకు తీసుకవచ్చి అక్రమంగా ఎక్కువ రేటుకు అమ్ముకుటున్న మండల అధికారి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయితేజ, శివ, చరణ్, స్టాలిన్, కార్తీక్, వంశీ, సందిప్, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నాయకులు

క్రీడా పాఠశాలకు విద్యార్థిని ఎంపిక


చందన

గణపురం: తెలంగాణ రాష్ట్రంలోని హాకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ క్రీడా పాఠశాలలకు జరిగిన రాష్ట్ర స్థాయి ఎంపికల్లో గణపురం మండలం అప్పయ్యపల్లె గ్రామానికి చెందిన దుర్గం చందన ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి చిలువేరు సురేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పయ్యపల్లె ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న చందన జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన ఎంపికల్లో రాష్ట్ర క్రీడా పాఠశాలకు ఎంపికైనట్లు వివరించారు. రాష్ట్ర క్రీడా పాఠశాల ఎంపికైన చందనను పాఠశాల సిబ్బందితో పాటు పలువురు అభినందించారు.

డెడ్ స్టోరేజీకి చేరువలో బొగ్గుల వాగు


బొగ్గుల వాగులో అడుగంటిన నీళ్లు

మల్హర్: మండలంలోని బొగ్గుల వాగు ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరువైంది. బొగ్గుల వాగు నీటి మట్టం 406 ఎంసీఎఫ్‌టీలకు 76 ఎంసీఎఫ్‌టీకి పడి పోయి పూర్తిగా డెడ్ స్టోరేజీకి చేరువైంది. మల్హర్ మండలంతో పాటు జిల్లాలోని వివిధ మండలాల్లో విస్తరంగా వర్షాలు కురిస్తే ఈ ప్రాజెక్టులోని భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. కానీ ప్రస్తుత సీజన్‌లో సరిగ్గా వర్షాలు కురుస్తుండక పోవడంతో ప్రాజెక్టులో చుక్క నీరు రాలేదు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలతో ఈ నాటికే ప్రాజెక్టుకు జళకళ సంతరించుకుంది. ప్రాజెక్టు ద్వారా ఎడ్లపల్లి శభాష్‌నగర్, వల్లెకుంట, కొండపేట, రుద్రారం, కాటారం మండలంలోని శంకరాంపల్లి, ధన్వాడ, విలాసాగర్, గంగారం, రేగులగూడెం ప్రతి వానాకాలం, యాసంగి సీజన్‌లో 5050 ఎకరాల ఆయ కట్టుకు సాగు నీరు అందుతుంది. ఇలా వర్షాలు సక్రమంగా కురుకుంటే 3వేల ఎకరాల సాగు ప్రశార్థకంగా మారుతుందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్ ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై చల్ల రాజు

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న ఈదునూరి రమేష్ తన మొబైల్ ఫోన్‌ని గతంలో పోగొట్టుకున్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ ఫోర్టల్ ద్వారా సెల్ ఫోన్‌ను గుర్తించి బాధితుడు రమేష్‌కు ఎస్సై చల్ల రాజు మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మధూకర్, హర్షితారెడ్డి ఉన్నారు.

ప్రమాదకరంగా వంతెన

మల్హర్: మండలంలోని మాల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని దబ్బగట్టు శివారులోని ఆరె వాగుపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం వంతెనపై పలు చోట్ల భారీగా గుంతలు ఏర్పడి, రాడ్లు పైకి తెలుతున్నాయి. ఈ రహదారి గుండా తాడిచర్ల, మల్లారం మీదుగా మంథని, కాటారం వైపు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. వంతెనపై భారీ గుంతలు పడి రాడ్లు పైకి రావడంతో వంతెనపై నుండి ప్రయాణిస్తే ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనాదురులు భయపడుతున్నారు. ప్రస్తుత వర్షాల సీజన్‌లో వంతెనపై ఏర్పడిన గుంతల్లోకి నీళ్లు నిలుస్తున్నాయి. రాత్రి సమయంలో వంతెన మీదుగా ప్రయాణం చేస్తే గుంతలు కనబడక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. అలాగే గుంతల కారణంగా వాహనాలు సైతం చెడి పోతున్నాయని వాహనాదారులు వాపోతున్నారు. ఇకనైన సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరగకముందే వంతెనకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


వంతెనపై గుంత ఏర్పడి రాడ్లు తేలడంతో నిలిచిన నీరు

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు


బ్రీత్ ఎనలైజర్ చేస్తున్న ఎస్సై రమేష్

చిట్యాల: మద్యం తాగి వాహనాలు పడుపొద్దని ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో వాహన తనిఖీ నిర్వహించారు. వాహనదారులు తప్పకుండా ధువీకరణ పత్రాలు కలిగి ఉండాలని కోరారు. అనంతరం ఎనమిది మంది వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్ తదితరులు ఉన్నారు.

కాటారంలో వర్షం

కాటారం: మండలంలో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు వర్షం కొనసాగింది. వర్షం కారణంగా రోడ్లన్ని జలమయంగా మారిపోయాయి. పలు కాలనీల్లో రహదారులు బురదమయంగా మారిపోయాయి. వర్షం రోజంతా కొనసాగడంతో ప్రజలు రోడ్లపైకి రాలేదు. గ్రామాల్లోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

టేకుమట్ల: మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ గర్మిళ్లపల్లి 1996–97 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాల ఆవరణంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యా బుద్దులు నేర్పించిన ఆనాటి గురువులకు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు. అనంతరం ప్రతి విద్యార్థి పాఠశాలలోని గత మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపగాని రాజయ్య, హింగే బాబురావు, కారుకూరి నారాయణ, పూర్వ విద్యార్థులు సలిగంటి సంపత్, పోలవేన పోషాలు, బీంపల్లి రామస్వామి, బుర్ర శంకర్, కర్క అజయ్, ప్రకాశ్‌రెడ్డి, సదానందం, పరమేశ్వర్, వేణు, బద్రి, కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల తనిఖీ

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామంలో ఉన్న రైజింగ్‌సన్, వాణి విద్యానికేతన్ ప్రైవేటు పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి కొడెపాక రఘుపతి మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా పాఠశాలలోని తరగతి గదులను, రిజిస్టర్లను పరిశీలించారు. తరగతుల వారిగా ఫీజుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకే పాఠశాలలను నడిపించాలని, అతిక్రమిస్తే చట్ట రీత్యా చర్యలు తప్పవని పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. సీఆర్పీ రాజు ఉన్నారు.


రైజింగ్‌సన్ పాఠశాలలో విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈఓ రఘుపతి

రైతులకు శాపంగా మారిన కాంగ్రెస్

చిట్యాల: రైతులకు కాంగ్రెస్ పార్టీ శాపంగా మారిందని జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జూకల్ గ్రామంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని కించపరిచే విధంగా మూడు గంటలు కరంట్ సరిపోతుందని చేసిన వ్యాఖ్యలపై ఇక్కడి రైతులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు మూడు గంటలు కరెంట్ కాదు మూడు పంటలు పండే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ అందిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన మాటలను రైతులు వ్యతిరేకించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల కో–ఆర్డినేటర్ రవీందర్ రావు, మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య, స్థానిక సర్పంచ్ పుట్టపాక మహేందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీటీసీ గొర్రె సాగర్

మానేరు వాగులో తెగిన తాత్కాలిక రోడ్డు

టేకుమట్ల: మండలంలోని గరిమిళ్లపల్లి–ఒడేడు గ్రామాల మధ్యగల మానేరు వాగులో నిర్మించిన తాత్కాలిక రోడ్డు మంగళవారం కురిసిన వర్షానికి తెగిపోయింది. దీంతో జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి రెండు జిల్లాల సరిహద్దు గ్రామాలు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రతీ సంవత్సరం వరద ఉధృతి తగ్గగానే వాగులో తాత్కాలిక రోడ్డుకు మోరం పోయిస్తారు. ఈ ప్రాంతం నుంచి అనేక మంది ప్రయాణికులు పెద్దపల్లి, గోదావరిఖని, రామగుండం, మంచిర్యాలకు వెళ్లాటానికి కొంత మేర సులువుగా ఉంటుంది. కాగా, మానేరు ఉప్పొంగి పోవడంతో టేకుమట్ల ఎస్సై చల్లా రాజు సందర్శించి పరిశీలించారు. ఎవరు వాగులో నుంచి వెళ్లరాదని తెలిపారు.


మానేరు వాగు వద్ద పరిశీలిస్తున్న ఎస్సై చల్లా రాజు

సీఎం కేసీఆర్‌పై కేసు హాస్యాస్పదం

వాజేడు: సీఎం కేసీఆర్‌పై భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య పోలీస్ స్టేషన్‌లో కేసుపెట్టడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెనుమళ్ల రామ కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చెసి మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాలుగు సంవత్సరాల్లో నియోజగవర్గంలో చేసిన అభివృద్ధి చెప్పాలన్నారు. తట్ట మట్టి కూడా పొయ్యని ఎమ్మెల్యే సీఎంపై కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి ఎల్లయ్య, వేణుగోపాల రావు, సాంబశివరావు, సరబాబు, శ్రీను, కృష్ణ బాబు, కుమార్, వెంకటేశ్వర్లు, ప్రశాంత్, అల్లి ప్రశాంత్, సాగర్ ఉన్నారు.


వాజేడు: మాట్లాడుతున్న రామ కృష్ణారెడ్డి

ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యం

వెంకటాపురం(కె) : భద్రాచలం నియోజకవర్గంలో ఎమ్మెల్యే పొదెం వీరయ్య అభివృద్ధి శూన్యం అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీతోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని అన్నారు. అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌పై ఎమ్మెల్యే తప్పుడు ఆరోపణలు చేస్తు కేసులు పెడుతున్నాడని అన్నారు. ముఖ్య మంత్రి కెసీఆర్‌పై చేసిన తప్పుడు ఫిర్యాదును వెనక్కు తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే వీరయ్య మండలంలో ప్రభుత్వం జూనియర్ కళాశాల, అస్పత్రి ఆధునికరణ చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయలేదని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే వీరయ్య హామీలను అమలు చేయకుండా మోసం చేశారని పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాయం రమణ, సర్పంచ్‌లు పూజారి ఆదిలక్ష్మి, పూనెం శ్రీదేవి, గంగా, సమ్మయ్య, మండల కార్యదర్శి పిళ్ళారి శెట్టి మురళి, నాయకులు వేల్పూరి లక్ష్మీ నారాయణ, మద్దుకూరి ప్రసాద్, గాందర్ల నాగేశ్వరావు, భిక్షపతి, తదితరులు ఉన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

మంగపేట: మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతం వెంట గల గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని వరద ముంపునకు గురయ్యే జనావాసాల ప్రజలను అప్రమత్తం చేయాలని మండల స్పెషలాఫీసర్, జిల్లా ఎస్సీకార్పోరేషన్ జిల్లా అధికారి తుల రవి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషలాఫీసర్ అధ్యక్షతన గోదావరి వరదలపై మండల స్థాయి అధికారులు, 25 గ్రామపంచాయతీల కార్యదర్శులతో వరదలపై ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్బంగా రవి మాట్లాడుతూ.. రెండు రోజులగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పాటు గోదావరి ఎగువ ప్రాంతంలో నిర్మించిన ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసిన కారణంగా గోదావరి వరద పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. గత ఏడాది వరదల తీవ్రత అంచనాతో ఎప్పటి కప్పుడు గోదావరి పెరుగుదల సమాచారాన్ని తెలుసుకుంటూ మండలంలోని గోదావరి వరద ముంపు గ్రామాల ప్రజలను ఆయా గ్రామాల అధికారులు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఉంటే గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేంత వరకు మండల హెడ్‌క్వార్టర్‌ను వదిలి వెల్లొద్దని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ సూచించారు. అదే విధంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ఉండేందుకు దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎస్సై ఎస్‌కే తాహెర్‌బాబా, ఏఓ చేరాలు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ యాకన్న, పంచాయతీరాజ్ ఏఈ పాటి వాసుదేవరెడ్డి, ఇరిగేషన్ డీఈ రవికుమార్, మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి నరేష్, చుంచుపల్లిపీహెచ్‌సీ వైద్యాధికారి యమున, ఐసీడీఎస్ పీఓ హేమలత, ఈజీఎస్ ఏపీఓ చరణ్‌రాజ్, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకధికారులు, ఈజీఎస్ పీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ రవి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

విద్యుదాఘాతంతో పశువులు మృతి

కాటారం: విద్యుదాఘాతంతో రెండు పశువులు మృతి చెందిన సంఘటన కాటారం మండలం రేగులగూడెం గ్రామపంచాయితీ పరిధిలోని బూడిదపల్లిలో వేరు వేరుగా చోటు చేసుకొంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనగంటి తిరుపతికి చెందిన ఎద్దు, మంథెన రాజయ్యకు చెందిన ఆవు పశుగ్రాసం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ ఎర్త్ వైర్‌ను తాకాయి. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రెండు పశువుల విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటుందని ట్రాన్స్‌కో ద్వారా నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.


విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఎద్దు